
పెద్ద తోడేలు, చిన్న తోడేలు



పెద్ద తోడేలు, చిన్న తోడేలు

తెలుగు : కె. సురేష్






ఒక కొండ శిఖరం మీద చెట్టు కింద ఒక పెద్ద తోడేలు ఒంటరిగా ఉండేది. అది ఎప్పటినుంచో అక్కడ ఒంటరిగానే ఉంది. ఒక రోజు దానికి అటుగా వస్తున్న చిన్న తోడేలు దూరాన కనపడింది. ఎంత దూరం అంటే మొదట్లో అది చిన్న చుక్క లాగా కనిపించింది.



ఆ వచ్చే చిన్న తోడేలు తనకంటే పెద్దగా ఉంటుందేమోనన్న ఆందోళన పెద్ద తోడేలుకి కలగసాగింది.

ఆ తోడేలు కొండ ఎక్కటం మొదలుపెట్టేసరికి అది చాలా చిన్న తోడేలని తెలిసిపోయింది. ఇప్పుడు పెద్ద తోడేలుకి నిశ్చింతగా ఉంది.

అది చిన్న తోడేలుని తన చెట్టు దగ్గరకు రానిచ్చింది.



శిఖరం మీద చెట్టు కింద చిన్న తోడేలు రోజంతా కూర్చుంది. చెట్టు కింద ఇప్పుడు రెండు తోడేళ్లు ఉన్నాయి.


పెద్ద తోడేలు, చిన్న తోడేలు.

ఆ రెండు తోడేళ్లూ ఒక్క మాట కూడా మాట్లాడుకోలేదు. కానీ, రెండూ పక్క చూపులతో ఒకదానినొకటి చూస్తూ ఉన్నాయి. ఆ చూపులలో కుతూహలం తప్పించి అనుమానం లేదు.




రాత్రి అయ్యింది. చిన్న తోడేలు ఎక్కడికైనా వెళ్లిపోతే బాగుండునని పెద్ద తోడేలు అనుకుంది. ఎప్పటినుంచో ఇది తన చెట్టు, తాను ఎప్పుడూ ఒంటరిగానే ఉంది. కానీ చిన్న తోడేలు అక్కడే పడుకుంది.


రాత్రి చలికి ఒణుకుతున్న చిన్న తోడేలును చూసి తన ఆకుల దుప్పటిని కొంచెం దాని వైపు తోసింది. చిన్న తోడేలుకి ఆ చిన్న భాగం సరిపోతుందని పెద్ద తోడేలు అనుకుంది.



మరునాడు ఉదయానికి కూడా చిన్న
తోడేలు అక్కడే ఉంది. ప్రతిరోజు లాగానే
పెద్ద తోడేలు వ్యాయామం చెయ్యటానికి
చెట్టు పైకి ఎక్కింది. చిన్న తోడేలు కూడా
దాని వెనకే చెట్టు ఎక్కసాగింది.

చిన్న తోడేలుని పెద్ద తోడేలు చూసింది. అది తన కంటే చెట్లు బాగా ఎక్కగలదేమోనని పెద్ద తోడేలుకి అనుమానం వచ్చింది. కానీ, చెట్టు ఎక్కడానికి చిన్న తోడేలు రెండు సార్లు ప్రయత్నించాల్సి వచ్చింది. మొదటిసారి అది కింద పడిపోయి, “అయ్యో!” అంది. రెండవసారి ప్రయత్నించి అది చెట్టు ఎక్కగలిగింది. ‘ఈ తోడేలు ధైర్యం గలదే,’ అనుకుని తనతో పాటు వ్యాయామం చెయ్యటానికి పైకి ఎక్కనిచ్చింది.





కిందకి దిగే ముందు పెద్ద తోడేలు అల్పాహారానికి కొన్ని పళ్లు కోసింది. ఎప్పటికంటే కొన్ని ఎక్కువ పళ్లు కోసింది. దాని వెనకే చిన్న తోడేలు చెట్టు దిగింది. కానీ అది తన కోసం ఏమీ కోసుకోలేదు.

పెద్ద తోడేలు పళ్లు తినటం మొదలుపెట్టి ఒక పళ్లాన్ని చిన్న తోడేలు ముందుకి తోసింది. చిన్న తోడేలు కూడా తినటం మొదలుపెట్టింది.





తిన్న తరవాత పెద్ద తోడేలు నడకకి బయలుదేరింది. కొండ దిగిన తరవాత అది వెనక్కి తిరిగి చూసింది. చిన్న తోడేలు చెట్టు కిందే ఉంది. పెద్ద తోడేలు తనలో తాను నవ్వుకుంది. చిన్న తోడేలు నిజంగా చాలా చిన్నగా ఉంది.

కొండ కింద చేను దాటిన తరవాత పెద్ద తోడేలు మళ్లీ వెనక్కి తిరిగి చూసింది. చిన్న తోడేలు ఇంకా చాలా చిన్నగా ఉండటం చూసి పెద్ద తోడేలు మళ్లీ నవ్వుకుంది. అడవి అంచు దగ్గరకి వెళ్లిన తరవాత చివరిసారిగా పెద్ద తోడేలు వెనక్కి తిరిగి చూసింది. తాను నిజంగా పెద్ద తోడేలు కాబట్టి అంత దూరాన నలుసు లాగా ఉన్న చిన్న తోడేలుని చూడగలుగుతోంది. ఆ తరవాత అది అడవిలోకి ప్రవేశించింది.

ఆ సాయంత్రం అడవి లోంచి బయటకు వచ్చిన పెద్ద
తోడేలుకి చెట్టు కింద చిన్న తోడేలు కనిపించలేదు.
“చాలా దూరంగా ఉండటం వల్ల కనపడటం లేదేమో,"
అనుకుని తనలో తాను నవ్వుకుంది.


చేను దాటి కొండ మొదలు దగ్గరకి వచ్చినప్పుడు కూడా
చెట్టు కింద పెద్ద తోడేలుకి ఏమీ కనిపించలేదు.
“ఆశ్చర్యంగా ఉందే," అనుకుంది పెద్ద తోడేలు,
“ఇప్పుడు కూడా కనపడక పోవటానికి చిన్న తోడేలు
మరీ అంత చిన్నదేమీ కాదే."






జీవితంలో మొదటిసారి పెద్ద తోడేలు ఆందోళనకు గురయ్యింది. ఎప్పటిలాగా కాకుండా కొండపైకి చాలా వేగంగా ఎక్కింది.

ఆ చెట్టు కింద పెద్దదిగాని, చిన్నదిగాని ఏమీ లేదు. ఎప్పటిలాగానే ఉంది. అయితే ఇప్పుడు పెద్ద తోడేలు విచారంగా ఉంది.



ఆ సాయంత్రం మొదటిసారి పెద్ద తోడేలు అన్నం తినలేదు. అది నిద్రపోని మొదటి రాత్రి కూడా అదే. అది ఎదురు చూస్తూ ఉంది. చిన్న తోడేలు తన గుండెలో చోటు చేసుకుందని మొదటిసారి అనుకుంది. అది చిన్నదే కానీ తన గుండెలో చాలా చోటునే ఆక్రమించింది.



ప్రతి రోజు లాగానే ఉదయాన్నే పెద్ద తోడేలు చెట్టు ఎక్కింది. అయితే ఎప్పటిలాగా అది వ్యాయామాలు చెయ్యలేదు. చిన్న తోడేలు కనపడుతుందేమోనని అది దూరాలకు చూసింది. కానీ దానికి ఏమీ కనపడలేదు.

చిన్న తోడేలు కోసం ఎదురు చూస్తూనే ఉంటానని అది తనలో తాను అనుకుంది.






చిన్న తోడేలు కోసం ఎదురు చూస్తూ

పెద్ద తోడేలు ఎన్నో విషయాల గురించి ఆలోచించింది. ఈసారి తన ఆకుల దుప్పటిలో ఎక్కువ భాగం చిన్న తోడేలుకి ఇస్తుంది. అది తిన్నంత ఆహారం పెడుతుంది. చెట్టు పైన తనకంటే ఎత్తుకి ఎక్కనిస్తుంది. తాను చేసే అన్ని వ్యాయామాలను దానికి నేర్పిస్తుంది. చిన్న తోడేలును మళ్లీ వెళ్లనివ్వదు. వీటన్నిటి గురించి ఆలోచిస్తూ చిన్న తోడేలు కోసం ఎదురు చూస్తోంది.




అలా ఉండగా ఒక రోజు పెద్ద తోడేలుకి దూరాన ఒక చుక్క కనిపించింది. దానికోసం ఎదురుచూసే వాళ్లకే కనిపించేటంత చిన్నగా ఆ చుక్క ఉంది. ఆ చుక్క ఎంతో దూరం నుంచి వస్తోంది. పెద్ద తోడేలు గుండె మొదటిసారి సంతోషంతో వేగంగా కొట్టుకోసాగింది. దూరంగా ఉన్న చిన్న చుక్క పెద్దది అవుతూ ఉంది. అది చిన్న తోడేలేమో చూద్దాం అని అనుకుంది, అది తనకంటే పెద్దదైతే మాత్రం ఏమిటని అనుకుంది.





కానీ అది పెద్దగా లేదు, ఇప్పుడు కూడా అది చిన్నగానే ఉంది.

అనుమానం లేదు, అది చిన్న తోడేలే.




చిన్న తోడేలు కొండ ఎక్కి చెట్టు కింద కూర్చుంది.

“ఇన్ని రోజులు నువ్వు ఎక్కడ ఉన్నావు?" పెద్ద తోడేలు అడిగింది.

“అక్కడ," ఎటూ చూపించకుండా చిన్న తోడేలు జవాబు ఇచ్చింది.

“నువ్వు లేకపోతే ఒంటరిగా అనిపించింది," పెద్ద తోడేలు లోగొంతుకలో అంది.



పెద్ద తోడేలుకి చిన్న తోడేలు దగ్గరగా వెళ్లి, “నాకు కూడా ఒంటరిగానే అనిపించింది," అంది.
పెద్ద తోడేలు భుజం మీద చిన్న తోడేలు తన తలను ఆన్చింది. పెద్ద తోడేలుకి ఇది మంచిగా అనిపించింది.
ఇక చిన్న తోడేలు ఎప్పటికీ అక్కడే ఉంటుందని నిర్ణయించుకున్నాయి.

అయిపోయింది